# సాయ్బా తాత

‘జిలేబి తాతొచ్చాడూ... జిలేబి తాతొచ్చాడూ...’ అని పిల్లలంతా అరుస్తూ సాయిబును చుట్టుముట్టారు. వారిలో కొందరు పిల్లలు కొంటూంటే మరికొందరు కొన్న పిల్లల దగ్గర అడిగి తీసుకునేందుకై ఎగబడ్డారు.

చుట్టూ అంతమంది పిల్లలున్నా సాయిబు కళ్లు ఎవరి కోసమో వెతుకుతున్నాయి. ఇంతలో ఒక చిన్నపిల్లాడు వచ్చి, తాతా... తాతా... నాకు రూపాయికి ఇవ్వవా... ప్లీజ్’ అని అమాయకంగా అడుగుతూంటే సాయిబు చిన్నగా నవ్వుతూ రూపాయి తీసుకొని జిలేబి ఇస్తూ ‘నువ్వు రోజూ రూపాయి మాత్రమే ఇస్తావు ఎందుకని?’ అని అడగ్గానే ‘ఎందుకంటే మా అమ్మ నాకు రూపాయే ఇస్తుంది’ అని ఒక్కో పదాన్నీ ఆలోచిస్తూ చెప్పాడా పిల్లవాడు.

‘అన్నట్టు ఈ రోజు ఇంకా అనితమ్మ తల్లి రాలేదెందుకూ?’ అని సాయిబు ఆ పిల్లవాడిని ప్రశ్నించాడు.

‘వచ్చేశాగా’ అని వెనుక నుంచి అనిత గొంతు వినిపించేసరికి వెనుదిరిగాడు సాయిబు. ‘వచ్చావా... చిట్టితల్లీ! ఇవ్వాళ ఇంత లేటయిందేం? అని ఆప్యాయంగా అడిగాడు.

‘నన్ను చిట్టితల్లీ అని పిలవద్దు సాయ్బా తాతా. పిల్లలంతా కూడా చిట్టితల్లీ! చిట్టితల్లీ! అని గేలి చేస్తున్నారు’ అని కాస్త ఏడుపు కలిసిన కోపంతో అంది అనిత.

‘ఆయ్... ఎవరు? ఎవర్రా అది నా చిట్టి తల్లిని వెక్కిరించేది’ అని కోపం నటిస్తూ గట్టిగా అరిచి, అనిత వైపు తిరిగి ‘ఈసారి ఎవరైనా వెక్కిరిస్తే నాతో చెప్పు. వాళ్లను కొడతాను. సరేనా’ అన్నాడు నవ్వుతూ.

తన బండి నుంచి జిలేబి తీసి ‘మా చిట్టి తల్లికి తియ్యని జిలేబి ఇదిగో’ అని ఇవ్వబోతూండగా ‘మా సాయ్బాతాతకి రూపాయిదిగో’ అంటూ అనిత రూపాయి చూపించింది.


సాయిబు అలిగినట్టు మొహం పెట్టి ‘ఏంటిది చిట్టితల్లీ, నేను నీదగ్గరెప్పుడయినా డబ్బు తీసుకున్నానా?’ అని అడిగితే ‘లేదు’ అని సమాధానమిచ్చింది అనిత.

‘మరైతే ఇప్పుడిదేంటి... కొత్తగా డబ్బులిస్తున్నావ్? నేనేమయినా అడిగానా?’ అని అడగ్గానే

డి.ఎల్. నరసింహులు

మొదటి కథ

'అదికాదు సాయ్బుతాతా! మరే, మా అమ్మ నేను రోజూ ఊరికినే నీదగ్గర జిలేబి తీసుకుంటు న్నానని తెలిసి కోప్పడింది. ఉత్తినే ఏది తీసు కున్నా కొడతానని కూడా చెప్పింది. అందుకే...' అని దీర్ఘం తీస్తూ తల దించుకుని ఇంకా ఏదో ఆలోచిస్తూండగా 'సరే! అయితే ఓ పని చెయ్. నాదగ్గర ఊరికే తీసుకుని, డబ్బిచ్చానని అమ్మతో చెప్పి, అమ్మ ఇచ్చిన డబ్బుని దాచుకో' అని సాయిబు సలహా ఇచ్చాడు.



'అమ్మో అబద్ధమే! ప్రాణం పోయినా అబద్ధ మాడరాదని బళ్లో టీచరూ ఇంట్లో అమ్మా ఎప్పుడూ చెప్తూనే ఉంటారు. నీకు మీ అమ్మ చెప్పలేదా?' అమాయకంగా ప్రశ్నించింది అనిత.

'ఎందుకు చెప్పలేదు? ఎప్పుడూ చెప్పేది. కానీ అవసరానికి అబద్ధం చెప్పడంలో తప్పు లేదు' అన్నాడు సాయిబు.

'అయినా సరే నేను చెప్పను. నువ్వు రూపాయి తీసుకుంటేనే నేను జిలేబి తీసుకుంటాను' అని అనిత ఖరాకండిగా చెప్పేసరికి సాయిబు ఆ రూపాయి తీసుకుని, జిలేబి మరింత ఎక్కువ వేసి ఇచ్చాడు.

'అయ్... ఇంత జిలేబి! అనిత ఆశ్చర్యపో తూంటే 'ఆ! మా చిట్టితల్లికి యిస్సెసలు' అని సాయిబు జిలేబి అనితకిచ్చి బండి తోసుకుంటూ ముందుకుసాగాడు.

మరునాడు ఎప్పటిలాగానే అనిత మిగతా పిల్లలతో బాటు ఆడుకోడానికి వెళ్లింది. ఆడు కుంటూ చాలాసేపు గడిపింది. కానీ జిలేబి

సాయిబు రాలేదు. ఎంతోసేపు ఎదురు చూసింది. చాలాసేపు చూసాక మిగతా పిల్లల్నడిగింది 'సాయ్బూతాత ముందే వచ్చి వెళ్లాడా? అని. 'ఎవరూ? ఆ జిలేబి తాతేనా? ఆ తాతయితే ఇంకా రాలేదు' అని జవాబిచ్చింది తన తోటి స్నేహితురాలు. చాలాసేపు చూసి ఇంటికి వెళ్లిపోయింది.

'ఇంతసేపు ఎక్కడ ఆడుకున్నావే? ఇంత పొద్దుపోయాక వచ్చావ్' కోప్పడింది తల్లి.

'ఇక్కడే ఆడుకున్నానమ్మా' అంది అనిత.

'సర్లే... వెళ్లి హోం వర్క్ చెయ్' ఆదేశించింది తల్లి.

కాసేపయ్యాక 'అనీ...! హోంవర్క్ పూర్తయిందా' గట్టిగా అరిచింది. 'ఆ...చేశానమ్మ' తనూ అరిచి చెప్పింది అనిత. 'సర్లే ... మొహం కడుక్కొని రా. భోంచేద్దాం' అని అనితకు చెప్పి 'ఏవండీ... మీరు కూడా రండి' అని భర్తని పిలిచింది.

అనితను మధ్యలో పడుకోబెట్టుకుని 'ఏవండీ... ఫోనులో మా అమ్మ చెప్పినట్టు అనీని ఎల్లుండే పంపించేద్దాం. మా తమ్ముడు దానిని స్కూల్లో చేర్చడానికి రేపే అన్ని ఏర్పాట్లూ చేస్తాడట. ఇంకో మూడ్రోజులాగితే వాడికి బాగా తెలిసిన ఆ హెడ్‌మాస్టర్ ట్రాన్స్‌ఫరవుతాడట. మనం ఏవిషయం రేపు ఫోను చేసి చెబితే వాడు రేపే వెళ్లి మాట్లాడి అన్ని ఏర్పాట్లూ చేస్తాడట. ఇప్పటికిప్పుడు అడ్మిషన్ దొరకాలంటే మాటలా' అంది అనిత తల్లి.

'దాన్ని పంపడం సరే. మరి మనం అక్కడుండడానికి ఇల్లూ అదీ చూసుకోవాలిగా' అన్నాడామె భర్త.

'ఆ విషయం కూడా వాడికప్పచెప్పేద్దాం. వాడే చూసుకుంటాడు. మా ఇంటికి దగ్గర్లోనే మంచి అద్దిల్లు చూడమందాం' అంది అనిత తల్లి. 'నేను రామనాధానికి ఫోన్ చేసాను. వాడికి అనంతపురంలో చాలా మంది తెలుసు. వాడు తప్పకుండా చూస్తానన్నాడు' అని భర్త చెప్పగానే 'మరయితే ఇంకేంటండీ... ఇటు నా తమ్ముడు, అటు మీ స్నేహితుడు ఇద్దరూ వెతికితే మనకు వెసులుబాటు ఉండేలా ఒక్క ఇల్లు దొరకదా' అందామె.

దొరకదని కాదే... అది ఎప్పుడు దొరుకుతుందో తెలీదు. అప్పటిదాకా దాన్ని మనకు దూరంగా అనంతపురంలో ఉంచడమెందుకు? మన దగ్గరే ఉండనీ' అని అతననగానే 'అప్పుడు వెళ్లినా దాని చదువు మధ్యలో ఆగిపోతుందిగా. ఇప్పుడే దాన్ని అక్కడకు పంపి అడ్మిషన్ కట్టిస్తే, దాని చదువు బాగా సాగుతుంది. అయినా కొద్ది రోజులేగా! అటు తర్వాత మనం ఎలాగూ వెళ్తాం. కొద్దిరోజుల్లోనే ఇల్లు దొరుకుతుంది. అప్పుడు మనమూ వెళ్తాం' అని నచ్చచెప్పిందామె.

'సరే అయితే. రేపు మీ తమ్ముడికి ఫోను చేసి మాట్లాడి, తర్వాత అనీ స్కూల్‌కెళ్లి వాళ్ల హెడ్‌మాస్టర్‌తో ఈ విషయం చెబుతాను' అని చెప్పాడు భర్త.

'సరే అలాగే చేయండి' అందామె అనితను జోకొడుతూ. వాళ్ల సంభాషణ వల్ల నిద్ర రాక వీళ్ల మాటలన్నీ విన్న అనిత కళ్లు తెరిచి అమ్మ వైపు చూసి, మళ్లీ కళ్లు మూసుకుని పడుకుంది.

తర్వాత రోజు ఎప్పటిలాగే అనిత ఆడుకోవడానికి వెళ్లినపుడు స్నేహితులందరితోనూ 'తాను ఊరికి వెళ్తున్నానని, పెద్ద స్కూల్లో చదువుతానని' గొప్పగా చెప్పుకుంది. సాయ్బూతాత ఆరోజు కూడా కాస్త ఆలస్యంగానే వచ్చాడు.

'ఏంటి సాయ్బుతాతా నిన్న రాలేదు. నేనెంతసేపు ఎదురు చూసానో తెలుసా?' అడిగింది కాస్త అలక మొహం పెట్టి.

'అయ్యో! నా చిట్టితల్లీ... పాపం నాకోసం ఎదురుచూసావా?... నిన్నంతా నాకు జ్వర మమ్మా. అందుకే రాలేదు. ఇవాళ కూడా నీర సంగా వున్నా నిన్ను చూడాలనే వచ్చాను' అని చెప్పాడు సాయిబుతాత కాస్త నీరసంగా.

'అయ్యో, పాపం! జ్వరంగా వుందా? ఇప్పు డు తగ్గిందా? తగ్గలేదా...? తగ్గకపోతే చెప్పు... నాకు జ్వరం వచ్చినపుడు మా అమ్మ ఇచ్చే మాత్రలు మా ఇంట్లో ఉన్నాయ్.

నవ్వుతూ, కాస్త వంగి అనిత తలపై చెయ్యి వేసి నిమురుతూ 'అక్కర్లేదు తల్లీ! నాకు జ్వరం తగ్గింది. అయినా నాకు ఆ మందు బిళ్లల కంటే నీ మాటలతో జ్వరం పూర్తిగా పోయింది' అని సాయిబు చెప్పగానే ఏదో గుర్తొచ్చినట్టు అనిత 'ఆ...సాయ్బుతాతా నీకో సంగతి చెప్పాలి' అని వెలుగుతున్న మొహంతో అతనివైపు చూసింది.

'ఏంటమ్మా అదీ...' అని సాయిబు నీరసం గానే అడిగాడు.

అనిత అదే సంతోషంతో 'నేను రేప ట్నుంచి ఈ ఊళ్లో వుండను. మరే... మా అమ్మమ్మ లేదూ అనంతపురంలో... వాళ్ల దగ్గరే వుంటానంట' అని చెప్పగానే...

'హా...బేటీ. నువ్వు చెప్పేది నిజమా' అనడి గాడు కాస్త కంగారుగా.

'అవును తాతా. మా అమ్మా నాన్నా మాట్లా డుకుంటుంటే విన్నాను. ఈరోజు మా నాన్న మా స్కూలుకొచ్చాడు కూడా. రేపొద్దుటే ప్రయా ణమంట. నాకక్కడ ఆడుకోడానికి ఎన్ని బొమ్మ లున్నాయో! మావయ్య అయితే ఎన్ని కొని పెడతాడో! అని అనిత ఇంకా ఏదో చెప్పబో తూండగా, 'ఐతే బేటీ... పోవడానికి నీకూ ఇష్టమేనా?' అడిగాడు మళ్లీ సాయిబు. 'అవును తాతా ఇష్టమే. చాలా చాలా ఇష్టం' చెప్పింది అనిత.

ఆ మాటలు విన్న సాయిబు కళ్లలో నీళ్లు తిరిగాయి. ఎవరూ తోడులేని వృద్ధాప్యంలో ఆ ఒంటరి సాయిబుకి ఆ చిన్నారి సావాసమే అండ. ఏదో తెలియని ఆత్మీయత వారి మధ్య. అందుకే జ్వరంతో ఒళ్లు కాలుతున్నా, నీరసంగా వున్నా సరే అనితను చూడాలని, ఆ పాప పలికే తియ్యటి మాటలు వినాలనీ తహతహ లాడిపోయాడు. మరి అలాంటి ఆత్మీయత దూర మవుతోందంటే ఎలా భరించగలడు? అందుకే బాధనంతా కన్నీటి రూపంలో జాలువార్చాడు.

అనితది చిన్న వయసు. అనుబంధాల గురించి, ఆత్మీయతల గురించీ తెలియని పసి వయసు. కొత్తను వింతగా భావించే పసితనం. ఎక్కడ వుంటే అక్కడి వారితో అల్లుకుపోయే పసిప్రాయం. అందుకే కొత్త వూరు... దూరంగా ఉండే అమ్మమ్మ, మావయ్యల దగ్గరకు వెళ్తున్నానని ఆనందించిందే గానీ, ఇక్కడ తన స్నేహితుల్ని గానీ, సాయ్బుతాతని గానీ వదిలి వెళ్తున్నానని ఆలోచించలేకపోయింది. కొత్తను ఆశించే ఆ పసిప్రాయంలో వదిలివెళ్లే వాటి గురించి ఏ పసిపాప ఆలోచించగలదు? అసలు వాళ్లని వదిలి వెళ్తున్నాననే ఊహే మెదలదు వారికి. ఎందుకంటే ఆ వయసులో స్నేహాలు ఏ పొరపొచ్చాలు లేనివి కాబట్టి. అవి శాశ్వ తంగా వారిలో ముద్రపడి వుంటాయి. అందుకే తామెక్కడికి వెళ్లినా తమ వెంట వాళ్లు కోరుకునే వాళ్లంతా ఉంటారన్న నమ్మకం. బహుశా అందుకేనేమో తన స్నేహితుల్ని, సాయ్బుతాతని వదిలి వెళ్తున్నందుకు బాధ పడకుండా, ఊరు

వెళ్తున్నందుకు సంతోషిస్తోంది. అవును మరి... తను ఎవరినీ వదిలి వెళ్లటం లేదు. తన జ్ఞాపకాలలో అందర్నీ పదిలంగా వుంచుకుని వెళ్తోంది.

ఈ విషయాలన్నీ తెలిసి సాయిబు చాలా బాధపడ్డాడు మనసులోనే.

'సాయ్బాతాతా...' అనిత పిలిచిన పిలుపుకు ఈలోకంలోకొచ్చాడు సాయిబు. 'క్యా బేటీ' అనడిగాడు. 'నా జిలేబి' అనడిగింది అనిత.

సాయిబు జిలేబి ఇవ్వగానే 'అమ్మో! ఇంతోటే' అని అనిత ఆశ్చర్యబోతూంటే 'మరి రేపట్నుంచి నువ్వుండనన్నావుగా' అన్నాడు సాయిబు మరింత నీరసంగా. అనిత వెళ్లబోతూంటే ఆపి 'చిట్టితల్లీ... నువ్వు ఊరెళ్లాక ఈ ముసలి సాయ్బాతాతని గుర్తుంచుకుంటావామ్మా' అని బొంగురు గొంతుతో అడిగాడు. ఆ క్షణంలో సాయిబు కళ్లలో నీళ్లు సుడితిరిగాయి.

ఆ మాట విన్న మరుక్షణం అనిత కళ్లలో కూడా నీళ్లు తిరిగాయి. ఏదో తెలియని బాధ కలిగింది. ఎందుకో ఆ పసిపిల్లకు తెలియదు.

'ఓ...' అని దీర్ఘం తీసి 'అలాగే తాతా. మరి నువ్వు?' అని తిరిగి ప్రశ్నించింది.

వణికే పెదవుల పైకి చిరనవ్వు తెచ్చుకుంటూ 'సాయిబు గొంతులో ప్రాణమున్నంత వరకూ ఈ చిట్టితల్లి ఎప్పుడూ గుర్తుంటుంది తల్లీ' అన్నాడు బాధగా.

'వస్తాను తాతా...' అంటూ చెయ్యి ఊపుతూ వెళ్లింది. కాస్త ముందుకెళ్లాక తిరిగి చూసి 'తాతా... టాటా...' అని చెప్పి వెళ్లిపోయింది.

అనిత వెళ్లిన వైపే చెయ్యి ఊపుతూ నిల్చున్న సాయిబు కాసేపటికి కళ్లు తుడుచుకుని, 'యా అల్లా' ఈ ముసలాడికున్న ఒక్క పసితోడును దూరం చేశావు కదా!' అంటూ నీరసంతోనే తన బలాన్నంతా ఉపయోగిస్తూ తన బ్రతుకు బండిని నెట్టుతూ ముందుకు కదిలాడు.

ఆ మరుసటి రోజు కూడా సాయిబు ఎప్పటిలాగే పిల్లలంతా ఆడుకునే చెట్టు కిందకు జిలేబి బండితో వచ్చాడు. జ్వరం తగ్గినట్టుంది కాస్త హుషారుగానే ఉన్నాడు. 'జిలేబి తాతొచ్చాడు...' అని పిల్లలంతా బండి చుట్టూ చేరారు. కొందరు కొనడం, కొన్న వాళ్లను మరికొందరు బతిమలాడడం షరా మామూలే.

చుట్టూ ఇంత సందడిగా ఉన్నా సాయిబు ఏమీ పట్టనట్టే చూస్తున్నాడు. ఊహు... ఎవరికో వెదుకుతున్నాడు. పిల్లలందర్నీ గమనించాడు. చుట్టూ తిరిగి చూశాడు. సందు చివరికంటా చూపు సారించాడు. ఏదో అయోమయంలో ఉన్నట్లు తల గోక్కున్నాడు.

ఇంతలో ఎప్పటిలాగే ఆ చిన్న పిల్లాడు వచ్చి 'తాతా... తాతా... నా దగ్గరుంది ఈ రూపాయి. దీనికి జిలేబి ఇవ్వవూ. ప్లీజ్' అని అడిగాడు.

సాయిబు రూపాయి తీసుకుని జిలేబి పొట్లం పిల్లవాడి చేతికిస్తూ "ఒరేయ్ చిట్టీ... నా చిట్టితల్లి అనితమ్మ ఇవ్వాళ ఇంతసేపయినా రాలేదెందుకూ?" అమాయకంగా అడిగాడు ఆ పిల్లవాడికేసి చూస్తూ.

అవును మరి... నిన్న తాను విన్నది నిజమని నమ్మబుద్ధి కావడం లేదు ఆ ముసలి ప్రాణికి. ●

యుద్ధం చేస్తే ప్రతిసారీ గెలవకపోవచ్చు. కానీ యుద్ధం చేయకపోతే 'గెలుపు' అనేది ఎప్పటికీ ఉండదు. క్రింద పడిపోవడం ఓటమి కాదు. లేచే ప్రయత్నం చేయకపోవడమే నిజమైన ఓటమి.